# 8000కు నిఫ్టీ

## • పెట్టుబడులకు ఇదే చక్కని తరుణం

పి. జయప్రకాష్



ఓ పదేళ్లపాటు క్రమం తప్పకుండా నాణ్యమైన ఈక్విటీ షేర్లలో పెట్టుబడి పెడితే లభించే ప్రతిఫలం అంతాఇంతా కాదు. పైగా అది ఆర్థికంగా అత్యంత అనుకూల వాతావరణం ఉన్నప్పుడైతే ఇక వెనుదిరిగి చూడన క్కర్లేదు. అటువంటి తరుణం ఇప్పుడు మన ముందుంది. దేశ ఆర్థిక వ్యవస్థ కనీవినీ ఎరుగని రీతిలో అప్రతిహతంగా ముందుకు సాగుతోంది. గత దశాబ్దకాలంలో సంభవించిన అనూహ్య మార్పులు ఇందుకు వీలు కల్పించాయి. అటు ఓపక్క ప్రభుత్వం తీసుకుంటున్న కట్టుదిట్టమైన చర్యలు, ఇటు మరోపక్క కార్పొరేట్ సంస్థల ప్రతిభాపాటవాలు కలగలిసి స్థిరమైన ఆర్థికాభివృద్ధి దేశంలో సాధ్యమవుతోంది. విజ్ఞానం, నైపుణ్యం, వృద్ధి కలిసి అద్భుతమైన ప్రగతిని ఆవిష్కరించే వీలుక లుగుతోంది. ఈ ప్రగతి ప్రయాణం ఇప్పుడే ఆగిపోయే అవకాశం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు భవిష్యత్ భారతంపై ఎంతో ఆశాభావంతో ఉన్నారు. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా పలు కుంభకోణాలు వెలుగుచూశాయి. రాజకీయంగా ఇబ్బందికర మైన పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. దీనికి స్పందనగా స్టాక్ మార్కెట్ కూడా కాస్త దిద్దుబాటుకు లోనైంది. ఈ పరిస్థితుల ప్రభావం తాత్కాలికమేనని.. దీర్ఘకాలంలో దేశ ఆర్థికవృద్ధిని నష్ట పరిచేవి కావని గమనించాలి. నాణ్యమైన షేర్లలో పెట్టుబడి పెట్టిన వారికి ఎటువంటి ఇబ్బందీ ఉండదు.

### సెన్సెక్స్ లక్ష స్థాయికి..

ప్రస్తుత తరుణంలో కార్పొరేట్ రంగం అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఆయా సంస్థల్లో పెట్టుబడిపై ప్రతిఫలం (రిటన్ ఆన్ ఈక్విటీ) చాలా ఎక్కువగా ఉంది. దీనివల్ల షేర్ల ధరలు బాగా పెరిగేందుకు వీలు కలుగుతోంది. ప్రస్తుతం బుల్ మార్కెట్ కచ్చితంగా సగంలో ఉంది. అన్నీ అనుకూలిస్తే వచ్చే మూడేళ్ల వ్యవధిలో నిఫ్టీ 12500 పాయింట్లకు, సెన్సెక్స్ 40000 పాయింట్లకు చేరుకునే అవకాశాలు లేకపోలేదు. కొత్త దశాబ్దాన్నే తీసుకుంటే, వచ్చే పదేళ్లలో స్టాక్ మార్కెట్ అయిదారు రెట్ల వృద్ధిని నమోదు చేస్తుంది. నిఫ్టీ, సెన్సెక్స్‌లు 2020 నాటికి వరుసగా 30,000, 1,00,000 పాయింట్ల స్థాయిని చేరుకుంటాయి. ఏమిటి... ఇంత పెరుగుదల సాధ్యమేనా? అనే అనుమానం కలక్కమానదు. కానీ భారతీయ స్టాక్ మార్కెట్లలో ఉన్న అవకాశాలను సరిగా అంచనా వేయగలిగితే, నిజమేనని మీకే అనిపిస్తుంది. 2011 సంవత్సరాంతానికి నిఫ్టీకి అంతర్గత విలువ ప్రకారం చూస్తే 8000 పాయింట్లు కనిపిస్తోంది. అందువల్ల కొత్త సంవత్సరంలో ఈ స్థాయిని అందుకోవడానికి స్టాక్ మార్కెట్ ప్రయత్నిస్తుంది.

**2011**
**స్టాక్ మార్కెట్**

### కొత్త దశాబ్దం మీదే

ఇప్పుడిప్పుడే వికసిస్తున్న బ్యాంకింగ్ రంగం వచ్చే కొన్నేళ్లపాటు మదుపరులకు లాభాల పంట పండిస్తుందని చెప్పవచ్చు. ఆటోమొబైల్, ఆటో విడిభాగాల కంపెనీలు, ఫార్మా, ఎఫ్ఎంసీజీ రంగాల కంపెనీలు దీర్ఘకాలిక పెట్టుబడికి అనుకూలంగా ఉన్నాయి. ఇంధనం, మౌలిక సదుపాయాల రంగాలు కూడా మంచి పనితీరు ప్రదర్శించవచ్చు. అగ్రశ్రేణి ఐటీ కంపెనీలను కూడా పెట్టుబడికి పరిగణనలోకి తీసుకోవచ్చు. దీర్ఘకాలానికి పెట్టుబడి పెట్టే సమయంలో మీ పెట్టుబడికి నష్టం వాటిల్లకుండా సురక్షితంగా ఉంచుకుంటూ మంచి ప్రతిఫలాన్ని సాధించాలనే విషయాన్ని విస్మరించరాదు. అందువల్ల నాణ్యమైన కంపెనీలను విభిన్నమైన రంగాల నుంచి ఎంచుకొని పెట్టుబడి పెట్టాలి. తెల్లవారిపాటికే ఎన్నో రెట్లు అధిక ప్రతిఫలం సంపాదించాలని ఆరాటపడకూడదు. అటువంటి ప్రయత్నంలో తప్పులు దొర్లుతాయి. అలాకాకుండా స్థిరమైన ప్రతిఫలం మీ పెట్టుబడి నుంచి లభిస్తుంటే మీరు హాయిగా గుండెల మీద చేయివేసుకొని నిద్రపోవచ్చు. ఇప్పుడు మీరు చేయవలసింది అదే. ఈక్విటీ పెట్టుబడులను విశ్వసించి, సరైన పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంటే కొత్త దశాబ్దం మీదే అవుతుంది.

డైరెక్టర్, ఆర్ఎల్‌పీ సెక్యూరిటీస్